# గాడీ తప్పిన జీవితం

మహత్తరమైన కార్యాల వెనుక మహత్తరమైన కారణాలే ఉండనవసరంలేదు. స్వల్పాతి స్వల్పమైన కారణాల వలన మహత్తరమైన కార్యాలు జరగటం అపురూపమేమీ కాదు. అంత మాత్రంచేత, ప్రతిస్వల్పకారణమూ గొప్ప కార్యాలను సాధిస్తుందనీ కాదు. గొప్పగొప్ప కార్యాలకు గొప్పగొప్ప కారణాలు ఉండవనీకాదు. 'కారణం' యొక్క చిన్నా, పెద్దా తారతమ్యాలకంటే, 'కారణం' చుట్టూ ఆవరించివున్న వాతావరణం ఎక్కువ ప్రాముఖ్యత కొస్తుంది. అప్పటి సందర్భమూ, ఆ సందర్భం వెనుకనున్న పరిస్థితులు గూడా అత్యంత ప్రధాన మవుతాయి.

*            *            *            *

ఒకప్పుడు శివయ్య కేలోటూ లేదు. పాతికెకరాల పల్లపు పొలంవుంది. పెద్దలు కట్టించిన లంకంత లోగిళ్ళు రెండున్నాయి. కాస్తోగూస్తో వడ్డీమీద తిరుగుతున్నది. జత ఎడ్లు ఒక జీతగాడు, ఊళ్ళోగౌరవము ఇవన్నీ ఉన్నాయి. శివయ్యజీవిత శకటం హాయిగా నడుస్తున్నది. ఆతనికితర బాదర బందీలేమీలేవు. ఒకళ్ళ జోలీ శొంఠీ పట్టించుకోడు. అతనికెవ్వరూ విరోధులులేరు. ఆతనెవరికీ విరోధికాడు. అటువంటి శివయ్య రెండుసంవత్సరాలు తిరిగొచ్చేసరికి ఎందుకూ కొరగాని వాడయ్యాడు. అతనంటే ఎవ్వరికీ గౌరవం లేకుండాపోయింది అతను అన్నివిధాలా దాదాపు పతనంపొందాడు. న్యాయంగా అయితే

ఆ సమయాన అతనికెంతో సానుభూతి సమాజంవల్ల లభించ వలసి ఉంది. ఆవిధంగా తనకళ్ళముందే తారాపథం నుండి అగాధంలోకి కూలిపోయిన వారిపట్ల సమాజం సానుభూతిని చూపి తీరుతుంది. కానీ శివయ్య వీటికి నోచుకోలేదు. అతని పతనంచూచి విచారించినవాళ్ళు లేకపోగా సంతోషించని వాళ్ళుకూడా లేరు.

అయితే యిది అచ్చంగా సమాజంతప్పు కానేకాదు. సమాజానికొక కొలబద్ద ఉన్నది. అది సజావైనదా కాదా అన్నవిషయం వేరు. ఒక్కొక్కరి దృష్టి కది మంచి కొలబద్ద కాకపోవచ్చు. కానీ సమాజం తన కొలతబద్దమీద గట్టినమ్మక ముంచుకొన్నది. దాని దృష్టికది ఉత్తమోత్తమమైనది. ఆ బద్దతో అది కొలుస్తుంది. సరిపోతే మంచివాడంటుంది. లేదో? అంత దౌర్భాగ్యుడు మరొకడు లేడంటుంది. సర్వదా అటు వంటివాడి పతనంకోసం నిరీక్షిస్తుంటుంది. సర్వనాశనం చేయాలని సర్వశక్తులనూ కూడగట్టుకుని సర్వప్రయత్నాలూ చేస్తుంది. వీటన్నింటినీ అధిగమించి నిలబడతారనుకో, అప్పుడు మేరు సమాన ధీరు డంటుంది. నేలబడి మట్టికరిచాడనుకో, దుష్టశిక్షణ మయినందుకు సంతసిస్తుంది. సమాజానికి రెండు విధాలా లాభమే మరి!

శివయ్య చేసినపని సమాజం అభినందించలేనట్టిది. అందుకే అతని పతనాన్నిచూసి జేజేలు కొట్టిందది. ఆతరువాత శివయ్య చాలాపశ్చాత్తాపపడ్డాడు. కానీ చేయిమించిపోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజన మేముంది!

"అతనారాత్రి ఆ నాటకానికి వెళ్ళకుండా ఉన్నట్లయితే ఈ గొడవ రానేరాదు ఇంతడబ్బు నష్టపడేవాడుగాడు. ఇంతకూ శివయ్య కొంప నిలువునా ముంచింది ఆ పాడు నాటకం" అంటూంటారు ఇప్పటికీ ఆ వూళ్ళో.

వాళ్ళన్నమాట ఒకరకంగా నిజమే. నిజంగా శివయ్యే గనక ఆరాత్రి నాటకానికి వెళ్ళకపోతే ఏ చిక్కూ ఉండక పోను. అతన్ని గురించి అనుకోవలసిందీ ఉండదు. అయితే ఆరాత్రి శివయ్యతోబాటు ఇంకా కొన్ని వందలమంది ఆనాటకానికి వెళ్ళారుగదా! వాళ్ళందరకూ చుట్టుకోని బెడద ఒక్క శివయ్యకే చుట్టుకోవాలా? వాళ్ళందరికీలేని పతనం ఒక్క శివయ్యకే వచ్చిందా?

లేదుగానీ శివయ్యకూ మిగతావాళ్ళకూ అక్కడే కొంచెం భేదమున్నది. మిగతావాళ్లు నాటకంచూచి ఇంటికొచ్చారు. శివయ్య అందులో హీరోయిన్ వేషంవేసిన దానింటికెళ్ళాడు. ఆక్షణంనుండే ప్రారంభమైంది పతనం. రెండు సంవత్సరాల్లో చెప్పుకోదగ్గ పరిణామాలు బోలెడన్ని జరిగాయి. ముఖ్యమైన వేమిటంటే హఠాత్తుగా శివయ్యకు నాటకకళమీద అభిమానం పుట్టుకొచ్చింది. స్వంతంగా ఒక కంపెనీ పెట్టాడు. చాలా నాటకాలాడించాడు. ఈనాడు సినిమారంగంలో కాస్తో కూస్తో నటించి పేరుతెచ్చుకున్న వారిలో చాలామందికి ఒకప్పుడు శివయ్య కంపెనీతో ఏదోఒక సంబంధం ఉండేవుంటుంది. అతని కళాభిమానం వల్ల నాటకరంగం కాస్త బాగుపడ్డది. కొంతమంది జనాభాకు ఆర్థికసమస్యలు తీరాయి. కొత్తకొత్త నటశేఖరులు, నటీమణులు తెలుగు ప్రేక్షకులకు పరిచయం

చెయ్యబడ్డారు. ఆ ఊపుతో వాళ్లు సినిమా పరిశ్రమ గేట్లోపడి ప్రస్తుతం మాంచిఫైల్లోఉన్నారు. మరికొంతమంది వెలగటమూ ఆరటమూకూడా పూర్తిచేసి విశ్రాంతి ననుభవిస్తున్నారు. ఈ కళాసమరంలో శివయ్య చావుదెబ్బ తిన్నాడు. అట్టడుగున నిలబడి సహాయంకోసం నాలుగువేపులా చేతులుచాపాడు. ఇదివరకు అతనిచుట్టూచేరి, అతనిసొమ్ము తెగతిన్నగుంపులో ఏఒక్కరూ అతన్ని ఆదుకున్న పాపానపోలేదు. చివరికి తను గాఢంగా ప్రేమించిన ఆ హీరోయిన్‌కూడా—తన నదివరకు అంతగా ఎరుగనట్లే మాట్లాడింది. ప్రస్తుతం ఆమెకి శివయ్యతో పనేమీలేదు. ఆమె సినిమా ఆలోచనకు ఇప్పటి శివయ్య ఏ విధంగానూ ఉపయోగించడు. ఇంకా ఈ తద్దినం తనకుమాత్ర మెందుకు? ఇందులో తనుచేసిన మోసమేమీ లేదనుకున్నది హీరోయిన్! శివయ్య నాటకాలకోసం కొంతడబ్బు తగలేసిన మాట నిజం! అందులో తను బావుకుచచ్చిందేమీ లేదు. ప్రతిఉమ్మాయి జగ్గాయి అతని దగ్గర పాతికాపరకా పుచ్చుకున్నదానికి తనేమీ బాధ్యురాలుకాదు. అయితే తనకొక మేడ కట్టించినమాట అబద్ధమని తనెప్పుడూ అనట్లేదు. రెండుసంవత్సరాలపాటు శివయ్యకు తను శరీరసౌఖ్యమిచ్చింది. ఈ జన్మలో అతనేనాడూ అనుభవించేందుకు వీలులేని అపురూపమైన ఆనందం తను అతని పాదాక్రాంతం చేసింది. నిజం మాట్లాడితే తనకే శివయ్య ఇంకాఋణపడిఉంటాడు. యిప్పుడు శివయ్యను తనేమీ కాదన్నదిలేదు, మరో నాలుగేళ్ళతర్వాత శివయ్య తన ఇంటిముందు కొస్తే తను తలుపులు తియ్యటానికి అభ్యంతరపెట్టదు.

అభ్యంతర పెట్టేదో లేదో గానీ, శివయ్య చచ్చిపోయాడు. అతనీ దిగులుతో మంచంపట్టి మరణించాడని కొందరంటారు. బహుశా అది నిజమే కావచ్చు. ఎందుకంటే శివయ్య చనిపోయే నాటికి రెండెకరాల పొలంకంటే ఎక్కువలేదు. అదయినా తన పేర లేదు. ఎదుగుతున్న ఇద్దరుపిల్లల క్షేమం నిమిత్తం భార్య తన పేర పెట్టించుకొన్నది. పోతే-ఉన్న రెండిళ్ళలోనూ, ఒకటి తాకట్టులో ఉన్నది, తాకట్టుబాకీ తీర్చేడబ్బుతో అటువంటి యిల్లే ఇంకొకటి సునాయాసంగా కట్టించవచ్చు, కాబట్టి అది ఉండికూడా లేని దాంట్లోనే జమ. అవిగాక ఇంకాచిల్లరమల్లర బాకీలు కొన్నిఉన్నాయి.

ఏది ఏమైనప్పటికి భాగ్యమ్మ-శివయ్య భార్య-మంచిపని చేసింది. లేకపోతే తనగతేమిటి? తన బిడ్డలగతేమిటి? ఆ రెండెకరాలన్నా ఉండబట్టి కొంతలో కొంతనయం! లేకపోతే, తనూ బిడ్డలూ దేశమ్మకాపులైపోవటం తప్ప వేరే మార్గమేముంది?

చివరి రోజుల్లో ముఖ్యులైనవాళ్ళవద్ద శివయ్య పశ్చాత్తాపపడినట్లు రుజువులున్నాయి. అయినా అతని స్థితికి జాలి పడినట్లు మాత్రం రుజువు లేదు. ఎందుకుంటుంది? సమాజం దృష్టిలో శివయ్యవంటికి మదమెక్కింది. అత్తనికళ్ళకు పొరలు కమ్మేసినై. పెద్దమ్మవారు నెత్తిన కూచున్నారు. దానితో అన్ని లపరబుద్ధులూ శివయ్యకు పుట్టుకొచ్చినై. ఉన్నదంతా ధ్వంసంచేసుకొన్నాడు. ఈ నాడు దిక్కూ మొక్కూ లేకుండా పోయినాడు. అతనిమీద సానుభూతి చూపించవలసిన అవసరం సమాజాని కేమున్నది! సమాజం పదహారణాల మూర్ఖత్వం

లోలేదు. దానికి కొంత ఆలోచనాశక్తి ఉన్నది. అది ఆలోచిస్తుంది. న్యాయాన్యాయాలు తోచినరీతిని నిర్ణయిస్తుంది. శాయశక్తులా వాటిని అమలు జరుపుతుంది. ఒకసారి ఒకడు గింజుకు చస్తున్నా దయతో ఒక్కమాటన్నా అనదు. ఒక్క చేయన్నా ఆసరాయివ్వదు. మరొకసారి వెగటుగలిగేంత గౌరవం అది కొందరి పాదాలముందు రాశిపోస్తుంది. మూడు తరాలవరకూ సరిపోయే సహాయం మూడుదిశలా ముసురుతుంటుంది. దానితీరే అటువంటిదీ!

దరిద్రం మంచిలక్షణంకాదు. అది కుష్ఠురోగంలాంటిది. ఒకసారి ఒకడికి కుష్ఠురోగం పట్టుకొన్నదనుకో, వాడిబిడ్డ, బిడ్డవంశమూ ఆ రోగానికి పాల్పడక తప్పదు. (!!) ఒక్కసారి దరిద్రం సర్కిల్‌లోకి వెళ్ళారో, శ్లేష్మంలోపడ్డ ఈగలాగా ఇంక దాంట్లోంచి రాలేరు. ఒకవేళ ఎక్కడైనా అట్లా వచ్చిన నిదర్శనం ఎవరైనా చూపించవచ్చు. అయితే అది సజావయిన పద్ధతి అయిఉండదని వెంటనే గ్రహించాలి. ఎందుకంటే "సన్మార్గం" ద్వారా డబ్బుసంపాదించడం అసంభవం... దరిద్రం అటువంటి మాదగోచ్ఛద్ వ్యాధి. దురదృష్టవశాత్తు ప్రపంచంలో చాలామంది ఈ వ్యాధితో నిత్యమూ బాధపడుతున్నారు. తన్నివారణార్థం రకరకాల 'మందులు' కనిపెడుతున్నారు. కొత్తఆయుధాలు సృష్టిస్తున్నారు. యుద్ధాలు చేస్తున్నారు. బాంబులతో పట్టణాలకు పట్టణాలను, దేశాలకు దేశాలను బూడిదరాసుల్లో ముంచెత్తుతున్నారు. అయినా ఈ జబ్బు పెరుగుతున్నదే కాని తరుగుతున్నట్లు లేదు.

దరిద్రం యాతనామయమే కానీ, దుర్భరమైందికాదు. ఇందులో విస్తుపోవటానికేమీ లేదు. పుట్టుకనుండీ దరిద్రం అనుభవిస్తున్నవాడిని దాని బాధ అంతగా పీడించదు. వాడు దానికి ఏనాడో అలవాటయిపోయ్యాడు. కానీ కొంతకాలంపాటు డబ్బు యివ్వగలిగిన అన్నిసుఖాలు అనుభవించినవాడికి దరిద్రంకంటే వేరే నరకమక్కర్లేదు. వాడికి ప్రతిక్షణమూ దుర్భరంగానే ఉంటుంది. ప్రతి ఘడియా పెనుగండంగానే ఉంటుంది.

ప్రస్తుతం భాగ్యమ్మగారు ఇదే స్థితిలో ఉన్నది. ఇదివరకు ఆమెకు దేనివిషయంలోనూ దిగులులేదు. ఇప్పు డామె కన్నీ దిగుళ్ళే కలిగిస్తున్నాయి. మొగుడు తనదారిన తాను పోయినాడు. పిల్లలా రెపరెప ఎదుగుతున్నారు. శంకరం చదువు ఈ ఏటితో ఈ వూళ్ళో పూర్తవుతున్నది. పై చదువులు చదవాలంటే విధిగా గుంటూరు వెళ్ళకతప్పదు. పై చదువులంటే కానీతోనూ, దమ్మిడీతోనూ గట్టెక్కవని భాగ్యమ్మకు తెలుసు. ఎంత తూతూ మంత్రంగా అంచనావేసినా మూడు నాలుగు వేలు కావాలి. ఇప్పుడు ఆమె దగ్గర చిల్లిడబ్బులేదు. పొలంమీద ఏదో కొంత రాకపోదు. వొచ్చిన ఆదాయమంతా శంకరం చదువుక్రింద ఖర్చుచేస్తే తనూ పద్మా ఎట్లా పొట్ట గడుపుకోవాలి? అన్నట్టు పద్మకూడా పెళ్ళీడుకొస్తున్నది. ఏదో శుభముహూర్తాన దాని కా మూడుముళ్ళూ వేయందే తనకు మనశ్శాంతి ఉండదు

పాపం! భాగ్యమ్మ ఇటువంటి గొడవపడ్డ మనిషి కానే కాదు. ఒకదాని తర్వాత మరొకటి; ఇసకపాతరల్లే వొస్తున్న

సమస్యలకు తను పరిష్కారం చెప్పుకోలేకపోయింది. ఆమెకు నిజంగా కాలూ చెయ్యీ ఆడలేదు. అవును మరి!

తన మనస్సులో ఉన్న ఉద్దేశాలను బైటపెట్టిన రోజున భాగ్యమ్మకు చాలామంది చాలా సలహాలిచ్చారు.

"కుర్రవాడు తెలివైనవాడు. ఒక్క క్లాసూ తప్పకుండా స్కూలు ఫైనలు గడువు దాటాడు. ఈ చదువుతో వాడికొట్టే మంచి ఉద్యోగం దొరకదు. అధవా దొరికినా అరవై డెబ్బయ్ రూపాయల్తో వాడికీ వాడి కుటుంబానికీ గడుస్తుందా? వాడి చదువుకు చాలా ఖర్చవుతుంది మరి! కానీ ఈ పాడురోజుల్లో అధమం బియ్యే తోకన్నా లేనిదే లాభంలేదు. పోతే పిల్లదా? శంకరం ప్రయోజకుడు కావాలే కాని, చెల్లెలి పెళ్ళి చెయ్యలేక పోడు. నిలుచున్న పళంగా పిల్లదాని నెత్తిన అక్షింతలు వెయ్యాలంటే, ఉన్న ఈ రెండెకరాలచెక్కా అమ్ముకోక తప్పదు. అటుచదువూ లేక ఇటు ఆస్తీలేక శంకరం ఏమవుతాడు?"

భాగ్యమ్మ ఒకనిర్ణయానికొచ్చింది. ఏదైతే అదే అవుతుంది, పైన భగవంతుడున్నాడు. తనింతవరకూ బుద్ధిపూర్వకంగా ఒకళ్ళకు హాని చేసి ఎరగదు. నారుపోసినవాడు నీరు ఎట్లాగూ పోస్తాడు. పిల్లదానికోసమని వాణ్ని అప్రయోజకుణ్ణి చేయటం దేనికి? భగవంతుడి దయవల్ల వాడు బియ్యే పాసయితే చెల్లెలి పెళ్ళి చెయ్యకపోడు గదా! అప్పటికయినా పద్మ ఈడుమించిపోదు. రెండున్నా రెండునాలుగునూ, పదమూడు, పదిహేడు. శంకరం బియ్యే అయ్యేనాటికి పద్మకు పదిహేడు నిండి పద్ధెనిమిదోఏడు వొస్తుంది. పద్ధెనిమిదేళ్లు ఈ కాలంలో పెళ్ళీడుమించిన ఈడుకానేకాదు. పాతికపళ్ళు దాటినాయింకా

పెళ్ళీపెటాకులు లేకుండా తిరుగుతున్న వాళ్ళను తనెందరిని రోజూ చూడటల్లేదు? వాళ్ళందరకూ రాని నామోషీత నొక్కదానికే వొస్తుందా ఏమిటీ? ఏమో? అప్పటికి కట్నం తీసుకోకుండా పద్మను పెళ్ళిచేసుకొనేవాడు దొరుకుతాడేమో? ఎవరు చెబుతారు? అన్నట్టు - ఇంకా తనాసంగతే ఆలోచించిలేదు. శంకరం బియ్యే అయితే వాడే పద్మకట్నం తనపెళ్ళిద్వారా సంపాదించగలడు. ఈ లోపుగా పద్మకూడా బడికెళ్ళిందంటే నయమే! చదువుకొన్న పిల్ల విషయంలో కట్నంకోసం అంత పట్టింపులు ఉండకపోవచ్చు. ఎన్నివిధాల చూసినా తను పిల్లవాణ్ని చదవెయ్యటమే శ్రేయస్కరంగా తోచింది భాగ్యమ్మకు.

అనుకొన్నవి అనుకొన్నట్లు జరిగితే ఎంత బాగుండును! కాని అదేం కర్మమో ఒక్కటిగూడా అట్లా జరగదుగదా! భాగ్యమ్మ అనుకొన్నట్లు నాలుగేళ్ళకుగాక ఆరేళ్ళకు శంకరం బియ్యే పాసయినాడు. ఈ లెక్కప్రకారం చూస్తే పద్మకిప్పుడు పందొమ్మిది వెళ్ళి ఇరవై ప్రవేశించి ఉంటుంది. ఆమె ఊహించినట్లు జరిగినట్లయితే శంకరం ఇప్పటికే ఏ గెజిటెడ్ ఆఫీసరో కావాలిసింది. పద్మకు పెళ్ళీగిళ్ళీ జరికిపోయి, సుఖోపాయంగా మొగుడుతో కాపురం చేసుకొంటూ, దేవుడు మేలుచేస్తే ఒక బిడ్డను ఎత్తుకోవలసింది. వీటిల్లో ఏఒక్కటీ జరగలేదు. శంకరంతోబాటు పద్మగూడా చదవటంవల్ల డబ్బు అంచనా మించి ఖర్చయింది. రెండెకరాల పొలమూ అలవసులవ ధరకు తెగగొట్టుకొన్నారు ప్రాణగండమొస్తే ఇల్లు అమ్ముకోవలసి వచ్చింది. వెధవది! ప్రాణంకంటే ఆస్తి ఎక్కువేముందీ? అయినా ఆపదలో అక్కరకు రాకపోతే ఆ ఆస్తి వుంటేనేం

లేకపోతేం. ఇప్పుడు భాగ్యమ్మకు 'నా'అని చెప్పుకోదగ్గ దేమీ లేదు. కొడుకు బియ్యే అయినాడనే తృప్తితప్ప వాడివల్ల కానీ ఆదా లేదు. కేవలం డబ్బు కటకటవల్లనే పద్మ ఇంటరుపూర్తి చేయలేకపోయింది. అమ్మకొచ్చినబాపతు ఇంకాసిని పిచ్చికలుంటే మార్చుకుతింటున్నారు. ఇవి కాసినీ అయిపోతే ఆ తరువాత ఎట్లా గడవాలో భాగ్యమ్మకు అర్థంకాలేదు. ఎంతబిజిలిగా వాడితే మట్టుకు నాలుగురోజులొచ్చే డబ్బు నాలుగు నెలలు రాదుగదా!

ఈ సమయంలోనే ఆమె కొక ఉత్తమోత్తమమైన ఆలోచన వచ్చింది. ఈఆలోచన ఇదివరకు ఆమెకు రానిదేమీ కాదు గానీ, అప్పట్లో దాని కాట్టే ప్రాముఖ్యం లేదు. ఇప్పుడు దానికున్నంత ప్రాముఖ్యం మరి దేనికీలేదు. తను సరోసరోపడి శంకరానికి పెళ్ళిచేస్తే కొంతలో కొంత విళంబరంగా ఉటుంది. వాడి కేం! నిక్షేపంలా బియ్యే అయినాడు. అధమపక్షం చూసుకున్నా అయిదారు వేలు కట్నం రాకపోదు. ఆడబ్బుతో పద్మపెళ్ళిచేస్తే తనబెడద వదిలిపోతుంది. పిల్లనిచ్చిన మామగారే అల్లుడి ఉద్యోగం చూసుకుంటాడు. పద్మ తనింటికి లేను పోతుంది! తనసంగతా? అప్పుడు తనెక్కడున్నా దిగులు లేదు. అయితే ఈ ఆలోచనను ఛిద్రంచేసిపారేశాడు శంకరం. వాడు పెళ్ళికి ఒప్పుకోలేదు.

"ఎందుకనిరా నాయనా!" అన్నది భాగ్యమ్మ.

"ఈ స్థితిలో నాకు పెళ్ళేమిటమ్మా? ఎవరన్నా వింటే నవ్వుతారు. నీదగ్గిరఉన్న ఆ నూటపాతిక రూపాయలూ అయిపోతే మనం కట్టకట్టుకుని గంగలో దూకటం కన్న గతిలేదే!

ఈ స్థితిలో ఇంకెవర్నో తెచ్చి నా కంటగట్టి అందరం కలసి చావాలని కోరుకుంటున్నావుటే అమ్మా నువ్వు? అదే నీ ఉద్దేశ్యమైతే, నేను దానికి ఒప్పుకోను. మన మీా గానుగలో పడి నలుగుతున్నాం సరేసరి! ఇంకొకరు మనకు తోడెందుకూ? ముందు మనం బైటికొద్దాం. ఆ తర్వాత నువ్వు చెప్పినవాటిని గురించి ఆలోచిద్దాం. అందాకా నువ్వేమీా మాట్లాడకు" అన్నాడు శంకరం.

"అదిగాదురా!" అంటూ భాగ్యమ్మ తనఆలోచనంతా కొడుక్కి చెప్పింది. తన ఈ ఉత్తమోత్తమమైన ఆలోచనకు కొడుకు చిమ్మ తిరిగిపోతాడని భాగ్యమ్మ ఊహించి ఉంటే, అది పూర్తిగా భ్రమ అనే చెప్పాలి. తల్లి వెలిబుచ్చిన ఈ ఆలోచన వినగానే శంకరం ఒక్క రవ్వయి నా తల్లిని మెచ్చుకోలేదు సరిగదా, ఆమె యిటువంటి దేబిరిగొట్టు ఆలోచన చేసినందుకు అసహ్యించుకున్నాడు గూడాను.

తను కోపంగా మాట్లాడినందుకు, అందులో నిజం మాట్లాడినందుకు తల్లి ముఖం మాడ్చుకోవడం గమనించాడు శంకరం. అతనికి తల్లినిచూస్తే ఆ క్షణాన చాలా జాలికలిగింది. ఆమెను నొప్పించినందుకు క్షణకాలం విచారించాడు. ఆమెను తిరుగా ఉత్సాహపరచటం ఎందుకైనా మంచిదనుకున్నాడు.

"నాకు తోచిందేదో నేను చెప్పాను. నేనుచెప్పింది నిజం కాకపోవచ్చు. పోనీ నువ్వు చెప్పినట్లే చేస్తాను. వివాహం చేసుకోవటానికి నాకు ఉన్న అభ్యంతరమల్లా ఒక్క డబ్బే! డబ్బువిషయం ఫరవాలేదని నువ్వుఎట్లా యిస్తున్నావో గానీ, నాకు భరవాసా యిస్తున్నావు. ఇందాక నువ్వు మాట్లా

డిన ధోరణినిబట్టి నువ్వు నన్ను మరొకలాగా అర్థం చేసుకున్నా వని నేను అర్థంచేసుకున్నాను. నేను ఎవర్నీ ప్రేమించనూలేదు. ప్రేమలో నాకు విశ్వాసమూలేదు. ప్రేమ పేరుతో పగటికలలు కనటం నాకు చేతకాదు. నన్నడిగితే డబ్బునుబట్టే ప్రేమలో తారతమ్యా లుంటాయంటాను...ఉండు, నన్ను చెప్పనివ్వు అమ్మా! ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే: నేను పెళ్ళి చేసుకోకపోవటానికి నే నెవర్నీ లోగడ ప్రేమించి ఉండలేదని నీతో చెప్పటం కోసరమే! నీయిష్టమొచ్చిన పిల్లను తీసుకురా నేను నిరభ్యంతరంగా పెళ్ళాడేస్తాను మరి ఆపైన బరువూ, భారమూ నువ్వు తీసుకుంటావా? ఆహా...నువ్వేమీ అను కోకు. అదిగాదమ్మా! ఈ స్థితిలో మనకు పిల్లనిచ్చే దెవరే? అందులో కట్నంతో వస్తేనే గానీ మనప్లాను నెరవేరదే? అటువంటి వాళ్ళున్నారంటావా? ఉంటే ఇట్టుకు నాకేమీ అభ్యంతరం లేదు.

భాగ్యమ్మగారి చుట్టూ మళ్ళీ చీకటి ఆవరించుకున్నది. శంకరం చెప్పింది నిజమే! ఈ స్థితిలో తమకు పిల్లనెవరిస్తారు? తనలాంటి స్థితిగతులు కలిగినవాళ్ళే వచ్చి పద్మ నివ్వమంటే- కట్నం లేకుండానే గావచ్చు, తను వప్పుకుంటుందా మరి? తానేవనైతే చెయ్యలేదో, అదేపని ఇతరులు తనపట్ల చెయ్యా లని తనెందుకు కోరుతున్నది?

అమ్మా, అన్నయ్యల సంభాషణ ఇంతసేపూ పద్మ వింటూనే ఉన్నది. కానీ ఆవిడ ఎటూ చెప్పదలచుకో లేదు. ఒక్కొక్కసారి అమ్మ చేసే ఆలోచన దివ్యంగా, నిరపాయంగా, మహాసులువుగా ఉంటుంది. కానీ ఆఆలోచన అన్నయ్య గ్గర

కళ్ళేసరికి నీళ్ళు కారిపోతుంది. శంకరం దానిని ఈకెకు ఈకె, తోకకు తోక లాగి బొమికముక్క చూపించుతాడు. అంత వరకూ దివ్యంగా ఉన్న ఆలోచన కాస్తా, దానంత దరిద్రపు గొట్టుది మరొకటి లేకుండా పోతుంది. ఏమయితేనేం గానీ తన అన్నయ్య మంచివాడనే ఇంతవరకూ పద్మ అభిప్రాయం. కానీ ఈ అభిప్రాయాన్ని ఒక్కొక్కసారి శంకరం చేతులారాధ్వంసం చేసుకుంటాడు. అటువంటి పాడు పనే వాడీపూట తల్లితో మాట్లాడుతూ చేశాడు.

శంకరం వివాహం చేసుకోనన్నంత వరకూ పద్మకేమీ పేచీలేదు. కానీ వాడు తనకు తెలియని విషయాలుకూడా తెలిసినట్లు మాట్లాడితేనే, తనకు మండుకొస్తుంది. కాకపోతే వాడు ప్రేమను గురించి మాట్లాడడ మెందుకూ! తనేఅమ్మాయినీ ప్రేమించలేదని వాడే ఒప్పుకుంటున్నాడుగా! అంటే ఆ విషయం వాడికేమీ తెలియనట్లు తేలిపోతోందాయె మరి. ఏమో! కామెర్ల రోగికి ప్రపంచమంతా పచ్చగా కనిపిస్తుందట. అంతమాత్రంచేత ప్రపంచం పచ్చగా ఉన్నట్లు కానే కాదు. శంకరానికి ప్రేమలో విశ్వాసం లేకపోవచ్చు. తను కాదనదు. కానీ డబ్బునుబట్టే ప్రేమలో తారతమ్యాలుంటాయంటే మట్టుకు ఛస్తే తను వప్పుకోదు. వాడుఊహించి చెబుతున్నాడు. తను అట్లాకాదు. అన్నయ్య చెప్పిందే నిజమయితే, మరి విశ్వం తన నెందుకు ప్రేమిస్తాడు? తననుతప్ప మరొకర్ని పెళ్ళిచేసుకోనని ఎందుకు మాట ఇస్తాడు. తనకోసం కుక్కలాగా ఎందుకు తిరుగుతాడు? తనను వెంటేసుకుని సినిమాలకు గట్రకు ఎందుకు ఖర్చుబెడతాడు? ఇవన్నీ అబద్ధమై ఒక్క

శంకరం చెప్పిందే నిజమా? తను ఊరికే తాత్సారం చేస్తోంది కానీ, ఒక్కసారి అమ్మతో చెబితే ఎగిరి గంతువెయ్యదూ? ఇదే గనక తను అన్నయ్య ఎదుట ఋజువుచేస్తే, వాడేమయి పోతాడు?

పద్మ ఎంత ఊహించినా, తను ఋజువు చేసినప్పుడు శంకరం ముఖం ఎట్లా ఎలా తెలా పోతుంటుందో బొమ్మ కట్ట లేకపోయింది...నిజమే మరి! పద్మ ఒకసారి ఒక స్నేహితురాలి ఇంటికెళ్ళింది. అదే సమయానికి ఆ స్నేహితురాలు ఇంకెక్కడికో వెళ్ళింది. ఆ విషయం పద్మ హాల్లోకి రాగానే తెలిసింది అయితే స్నేహితురాలు వచ్చేదాకా తను ఆగటమా వెళ్ళ టమా? ఏ విషయమూ తేల్చుకోక ముందే "కూర్చోండి మా చెల్లిఇప్పుడే వస్తుంది" అన్నాడు విశ్వం. అతను తన స్నేహితురాలి అన్నగారని పద్మ వెంటనే పోల్చుకున్నది లోగడ అనేకసార్లు తన అన్నను గురించి ఆ స్నేహితురాలు పద్మకు చెప్పింది. పద్మ కాదనలేక స్నేహితురాలు వచ్చేదాకా కూచున్నది. ఆ తర్వాత ముగ్గురూ కలిసి సినిమాకెళ్ళారు. అదేదో హిందీ సినిమా. అందులో ఒక్క 'ప్రేమ' తప్ప ఇంకేమీ లేదు. నాయికా నాయకులు అమితంగా ప్రేమించుకుంటారు. మధ్యలో కొందరు దుర్మార్గుల వలన విడిపోతారు. చివరికి కలుసుకుం టారు. ఆనందంగా పాడతారు. రెండు పావురాళ్ళు ముక్కుకు ముక్కు ఆనించుకుంటాయి ఆటఅయిపోయింది. ఇంటికి వస్తూ ముగ్గురూ ఆ సినిమాని గురించి చర్చించారు. ఆ సినిమాలో హీరోయిన్ పండ్లు అమ్ముకునే మనిషి. హీరో జమీందారు గారి అబ్బాయి. చూసీ చూడటంతోనే చప్పున ఆ అమ్మిని

ప్రేమిస్తాడు. "నువ్వుతప్ప నాకు ప్రపంచంలేదు." అంటాడు. ఇవన్నీ ఆ ముగ్గురి సంభాషణలోకి వచ్చినై.

"అయితే చూడవోయ్" అన్నది పద్మ స్నేహితురాలి భుజంమీద చెయ్యివేసి. "ఆ పిల్ల అంత పేదదిగదా! వాడు రిచ్ ఫెలో గదా! అటువంటప్పుడు లవ్ క్రియేట్ అవుతుందంటావుటోయ్"

ఈ ప్రశ్నకు విశ్వం సమాధానమిచ్చాడు.

"ఎందుకు కాదు? మన తెలుగు వాళ్ళయితే ఫిల్మును ధ్వంసంచేసిపారేసేవారు అటువంటి ఘట్టాల్లో. అక్కడేఉంది హిందీ డైరెక్టర్ల ఇంటెలిజెన్స్" అన్నాడు విశ్వం.

చెల్లెలు అక్షరాలా నిజమేనన్నది. అని పైగా "మా అన్నయ్య ఇటువంటి సినిమాలు చూసి బొత్తిగా కొరకరాని కొయ్య అవుతున్నాడు పద్మా! మా నాన్నగారు మంచిసంబంధాలు రెండుమూడు తెచ్చారు. ఈదొరగారు తను ప్రేమించిన పిల్లనుతప్ప-చేసుకోనంటున్నాడు. అందులోనూ పేదదయినా సరేట" అని కలిపింది.

పద్మ తనకున్న సందేహాన్ని కాస్తా బైటపెట్టింది "మరి బ్యూటీమో?" అని విశ్వంవేపు చూసింది.

విశ్వం నవ్వాడు. విశ్వం చెల్లెలూ నవ్వింది. పద్మకూడా నవ్వింది ఆ తర్వాత ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళారు.

పద్మ తనరొట్టెవిరిగి నేతిలోపడ్డదని భావించింది. ఆవిడ చిన్నదీ, చితకదీకాదు. ఇరవై ఏళ్ళున్నాయి. పైగా చదువుకున్నది. చాలా ఆలోచించిగానీ విశ్వానికి "చనువు" ఇవ్వలేదు. తనకేమో భగవంతుడు ఏ మాత్రమో అందమిచ్చాడు.

ఈ దరిద్రానికి తోడు ఇదికూడా లేకపోతే తనపాట్లు కుక్కలు కూడా పడవని పద్మ అనుకుంటుంది. తన అందం చాలామంది కుర్రకారుని కవ్విస్తున్నదని ఆమె ఏనాడో గ్రహించింది. కానీ ఎవ్వరికీ ఆమె "చోటు" ఇవ్వలేదు. ఇదీ కొంత మంచిదే అయింది. వెధవది: తనకు పెళ్ళి కాదనేమాట అబద్ధంగానీ, ఈవిధంగా అన్నివిధాలా తగిపోయిన విశ్వం వాటివాడు దొరుకుతాడా దొరకడా అనేదే సందేహం. ఇప్పటిడదికూడా లేదు. విశ్వానికి అటువంటి టేస్టు ఉండటం పద్మకు మంచిదే అయింది. లేకపోతే విశ్వంవంటి బంగారు పిచ్చుక పద్మకు ఈ జన్మలో భర్తగా దొరకటం కష్టం.

అమ్మా, అన్నయ్యా తన పెళ్ళిని గురించి అనుకుంటున్నప్పుడల్లా పద్మకు ఊరికే నవ్వువస్తుంది. ఒక్కోసారి చప్పున నిజం చెప్పబుద్ధేస్తుండేది. కానీ సమయం కాదని తిరిగి మానుకుంటుండేది. ఇప్పుడు అట్లా చెయ్యకూడదనుకుంది పద్మ. ఇంకెందుకూ? విశ్వం తన పేరెంట్సుతో చెప్పడానికి వాళ్ళఊరెళ్లాడు. రేపో ఎల్లుండో దిగుతాడు. ఈలోపుగా తను వీళ్ళతో చెప్పి అన్నీ సెటిల్ చేసేసే తీరిపోతుంది. తర్వాత మళ్ళీ బోలెడంత టైం వేస్టుకాకుండా ఉంటుంది. పెళ్ళి ఎటుగూడీ చాలా మోడరేట్‌గా అయిపోతుంది. అనగానే ఏ ఊటీకో వెళ్ళాలి. లేకపోతే ఈ గుంటూరు ఎండలు మరీ ఛండాలంగా ఉన్నయ్!

కుమారి పద్మ ఇన్ని ఆలోచనల తరువాత గానీ తల్లికి ఈ విషయం చెప్పిందికాదు. భాగ్యమ్మ ఏమాత్రమో వొణికింది.

"ఎందుకమ్మా, అట్లా ఇదవుతావ్? చూసుకో, రేపీపాటికి విశ్వం రాకపోతే నన్ను మారుపేరుపెట్టి పిలువు. నేను నీ కడుపున బుట్టినా నీఅంత తెలివితక్కుదాన్ని కాదు. ఇన్నిమాటలెందుకూ? రేపు విశ్వాన్ని చూసినతర్వాత నువ్వు ఫిట్టువచ్చి పడిపోతావు" అన్నది పద్మ.

భాగ్యమ్మగారు పదినిమిషాలకుగానీ తేరుకోలేదు.

"అయితే ఇంతకాలం నాతో ఎందుకు చెప్పలేదే అమ్మాయ్! నేను నీ పెట్టెలో అయిదారు కొత్తచీరెలు చూశాను ఏ స్నేహితురాలివో ననుకున్నాను గానీ నీవే నను కోలేను. ఈ కాలపు పిల్లలు ఎంతకైనా తగుదురే మాయమ్మా! ఓరి నీ సోద్యం కూలిపోను..." అని ఆశ్చర్యపడ సాగింది భాగ్యమ్మ.

"అన్నయ్యేడీ?" అన్నది పద్మ.

"ఎక్కడో పనిదొరుకుతుందని ఎవరో చెప్పారట. అక్కడికి కెళ్ళాడు. ఏమోగానీ, పద్మా! రేపు మీ విశ్వంతో చెప్పి శంకరానికి ఎక్కడన్నా కాస్త పని చేయించవే."

పద్మ మాట్లాడలేదు.

విశ్వం రానూ వచ్చాడు. పద్మ అతన్ని కలుసుకోనూ కలుసుకుంది.

"ఏమైంది?" అంటూ ఆత్రుతగా ప్రశ్నించింది పద్మ.

విశ్వం జరిగిన యావత్తు గ్రంథమూ చెప్పాడు.

"అయితే నాగతేమిటి విశ్వం" అన్నది పద్మ ఏడుపు గొంతుతో.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. సజావైన మార్గం ఒకటీ కనిపించటంలేదు. మామూలప్పుడు అంత క్విక్‌గా వర్క్ చేసే బ్రెయిన్‌కాస్తా సమయం వచ్చేసరికి చప్పున పనిచెయ్యటం మానేసింది. నిన్నెట్లా రక్షించటమా అని నేనూ త్రోవ పొడుగునా ఆలోచించాను. కానీ-ఒక్కటీ సరైన ఆలోచనే రాలేదు" అన్నాడు విశ్వం.

"చివరికి నువ్విట్లా అంటావని నే నెప్పుడూ అనుకోలేదు విశ్వం."

"నేను మాత్రం అనుకున్నానా మరి?" అన్నాడు విశ్వం. "నాకు నువ్వంటే అభిమానముంది. కానీ నామాట చిల్లి దమ్మిడీ విలువ కట్టలేదు మా నాన్న. నన్నేం చేయమంటావో చెప్పు?"

పద్మకు దుఃఖం పొర్లుకువచ్చింది. కుర్చీలో కూలబడి బావురుమని ఏడ్చింది. విశ్వం జేబులోనుంచి వందరూపాయల కాగితాలు ఐదు తీసి పద్మ వేపు విసిరాడు.

"ఆ డబ్బు తీసుకొని వెళ్ళు. ఇంకెప్పుడూ ఇక్కడికి రావద్దు. వచ్చినందువల్ల నాకేమీ అభ్యంతరంలేదు. కానిసొసైటీలో నీ కాట్టే గౌరవం ఉండదనుకుంటాను ఈ ఐదువందలు పట్టుకెళ్ళి సుఖంగా బ్రతుకు, నే వెడుతున్నాను" అన్నాడు విశ్వం.

కాండ్రించి ముఖాన ఊసినట్లయింది పద్మకు. ఆ అవమానం భరించలేకపోయింది.

"నే నేం భోగందాన్ననుకున్నావా నీ డబ్బు కాశించటానికి? ఈ వెధవ డబ్బు నాకేం అక్కర్లేదు. ఇవికూడా నీ ముఖంమీదనే వేసుకో"

విశ్వం పోతున్నవాడల్లా ఆగి ముందుకొచ్చాడు.

"పాపం చాలా కోపంలో ఉన్నావు కనుక, ఏం మాట్లాడుతున్నావో నీకే తెలియలేదనుకుంటాను. నువ్వు మాట్లాడిన దానికి నేను సరయిన సమాధానమిస్తే నువ్వు మరీ ఫూల్ వవుతావు. డబ్బు నువ్వన్నట్లు వెధవదేగానీ, దానికున్న పవర్ ఇంక దేనికీలేదు. నాదగ్గర లక్షలఆస్తి లేకపోతే నువ్వు నన్ను చేసుకోటానికి ఒప్పుకుంటావని నేను నమ్మను. రెండోది ఏమిటంటే, భోగంవాళ్ళకోసం కొంతడబ్బు ఖర్చుపెట్టాలిసొస్తుంది. నీ బోటివాళ్ళకోసం అటువంటిదేమీ అక్కర్లేదు పద్మా! నీకిష్టమైతేనే తీసుకో. ఒదిలి వెళ్ళితే నేనేమీ కాదనను. నేను వెడుతున్నాను ఆలోచించుకుని నీ ఇష్టమొచ్చినట్లు చెయ్యి."

పది సంవత్సరాల అనుభవం ఒక్కసారి లభించినట్లయింది పద్మకు. ఆలోచిస్తే విశ్వం అన్నదాంట్లో కొంత నిజం లేకపోలేదు. నిజంగా విశ్వానికి ఆ ఆస్తి లేకపోతే తను అతన్ని లవ్ చేస్తుందా? చెయ్యదని అంతరాత్మ చెబుతున్నది. తను అయిదు నెలలు విశ్వంతో తిరిగింది. అయిదు వందలరూపాయల నోట్లు తన కాళ్ళముందున్నాయి. లెక్క ప్రకారం చూస్తే నెల ఒకటింటికి తనఅందం ఖరీదు వందరూపాయలన్న మాట!

పద్మ అయిదు వంద కాగితాలూ రొంటిన దోపుకుని ఇంటికొచ్చింది.

"ఏమయిందే?" అన్నది భాగ్యమ్మ.

"ఏమవుతుంది? నేను చెప్పలేదుటే? అంతా రైట్ అయింది" అన్నది పద్మ.

"ఒరే అబ్బాయ్! శంకరం! పద్మతల్లి పెళ్ళి ఖాయమ యిందిరా" అంటూ భాగ్యమ్మ లోపలికెళ్ళింది.

ఈపూట పద్మకు అలసటేమీ లేదు. నర్సు ఇంతక్రితమే వచ్చి వెళ్ళింది. బాబిగాడుగూడా నిద్రపోతున్నాడు. పద్నా లుగు నెలలు తర్వాత కలము కాగితము తీసికొని అన్నయ్యకు ఉత్తరం వ్రాయసాగింది పద్మ.

కళ్యాణపురం
15-3-52

ఈ ఉత్తరం వ్రాయడానికి ముందు నేను చాలా ఆలో చించి వ్రాసిఉంటానని నువ్వు గ్రహించాలి. నీ కెప్పుడు మన స్సుకు కష్టంతో స్తే అప్పుడు దీన్ని చించిపారేయి. నేను సుఖంగా ఉన్నాను బాబిగాడుకూడా కులాసాగానే ఉన్నాడు. నే నిక్కడ ఒక నాటక కంపెనీలో వేషాలు వేస్తూ మొన్న మొన్నటిదాకా గడిపాను. ఒకరోజున నాటకం చూడటానికి చాలా మందితోపాటు ఒక లక్షాధికారికూడా వచ్చాడు. జన మంతా ఇళ్ళకు వెళ్ళారు. నేను రంగు కడుక్కోకుండానే నా బసకొస్తున్నాను. నా వెనకాతలే బసదాకా వచ్చాడు. నన్నూ నా నటననూ అమితంగా పొగిడాడు. అప్పుడే వేలినున్న ఉంగ రం బహుమతిగా యిచ్చాడు. ఉదయం కాఫీకి రమ్మన్నాను. వచ్చాడు. అంతే! నేనంటే అతనికి చాలా ప్రేమట. నేను ఒప్పుకుంటే ఏమికావాలన్నా యిస్తానన్నాడు. పిశ్వం ధర్మమా అంటూ నా అందపు విలువ గ్రహించాను. అందుకోసమని ఆయనకు థాంక్స్ చెప్పాలి. పోతే, నా కోసమని, తనకున్న రెండు మేడల్లోనూ వకటిఖాళీచేసి నాకిచ్చాడు. నేను ప్రస్తుతం

ఆ మేడలోనే ఉంటున్నాను. మేము కొద్ది రోజుల్లోనే ఒక సినిమా తియ్యబోతున్నాము. అందుకు కావలసిన డబ్బు ఆయనగారు పొలాలుఅమ్మి, ఇళ్ళు తాకట్టుబెట్టీ తెస్తున్నారు. మూడు నాలుగు వారాల్లో మదరాసులో ఇల్లు తీసుకోబోతున్నారు. నీకు ఇష్టమైతే ఇక్కడకురా! మాకంపెనీలోనే నెలకు మూడువందల జీతంమీద పనియిప్పిస్తాను. ఇష్టమైతే అమ్మను కూడా రమ్మను నాకేమీ అభ్యంతరంలేదు. ఉత్తరంలో ఇంకా చాలా సంగతులు రాద్దామనే ఉంది. బాబిగాడు లేచి ఏడుస్తున్నాడు. ఉంటాను.

—పద్మ.

ఆ ఉత్తరం అందినరోజున తల్లీకొడుకులు మల్లగుల్లాలు పడ్డారు. ఎవరు ముందు బైటపడితే పలచనగా ఉంటు దోనని ఇద్దరూ తొక్కిసలాండారు. చివరకు భాగ్యమ్మే తెగించి అడిగింది.

"ఏమిటమ్మా?" అన్నాడు శంకరం.

"ఏమీ లేదురా! అదే... ఆ ఉత్తరం...పద్మ... వ్రాసింది...ఏమిటంటావ్?" అన్నది నీళ్ళు నములుతూ.

"ఏమనటాని కేముందీ? నేను రాత్రిబండికి వెడదా మనుకుంటున్నాను. మరి నీయిష్టమేమిటో నువ్వు బైటపెట్టనే లేదు" అన్నాడు శంకరం.

"బైటపెట్టటాని కేముందిరా నాయనా! నీ యిష్టమే నా యిష్టం. ఈ ముసలితనంలో బిడ్డలమాట వినలేదనే అపనింద నాకుమట్టు కెందుకూ?" అన్నది భాగ్యమ్మ.